# రొయ్యకు లేదా!!

ఇసుకపల్లి దక్షిణామూర్తి

గోపాలం మీసం పెంచటానికి, చైనీస్ రెస్టారెంటుకు వెళ్ళి రొయ్యలు తినిరావటానికి ఏమీ సంబంధం లేదు. గోపాలం 'అద్దంలో' తనముఖం చూసుకుని చూసుకుని విసిగిపోయాడు. అదేముఖం. సబ్బురుద్దుకుని స్నో రాసుకుని, పౌడరుఅద్దుకుని ఆడపిల్లలా తయారయ్యే వాడని సాటి ఉద్యోగస్థులంతా ఎగతాళిచేసినా విననట్లు ఊరుకున్నాడు. దవడమీద చాచికొడితే దబ్బాడు పౌడరు రాలుతుందని అన్నప్పుడుకూడా కల్పించుకోలేదు. ఆపనిజరిగితే అవతలివాడి పళ్ళురాల కొట్టి,ఆడపిల్లను కాదురా మగవాడిని అని చెపుదామనుకున్నాడు. అప్పుడు వచ్చింది ఆలోచన. మగవాడిని అన్నీ చెప్పుకోవటం ఎందుకు? మీసం పెంచితే సరిపోలా? ఆరోజునే షేవింగు పెట్టెలోనుండి కత్తెర తీసి దాచేశాడు. సెన్సారులేని సినిమా ఫిలించుట్టలా మీసం విచ్చలవిడిగా పెరగసాగింది. తను ఎరిగినంతలో తరలుతప్పితే జీవితంలో ఏమీ పెరగడం లేదుఅనే నిస్పృహతగ్గింది. ముఖంలో కొత్తదనం కనిపించింది. కృష్ణదేవరాయలు జ్ఞాపకంవచ్చాడు. ఆమీసం పెరిగిపెరిగి చెవిపక్కనుంచి వచ్చేజుట్టుతో స్నేహం కలిపింది. అప్పటిదాకా సహించిన స్నేహితులు అతన్నిచూసి చాటుమాటుగా నవ్వటం మొదలు పెట్టారు.

'మీసంకాదు రోసం మనిషికి కావలసింది...'అనీ

'రొయ్యకులేదా బారెడుమీసం...'అనీ వెటకారం చెయ్యటంగూడా విన్నాడు. మరీ సన్నిహితులు 'ఏరా... మొక్కేమన్నా ఉందా...' అని ఎంక్వయిరీ చేశారు. అసలు అతను మీసం ఎందుకుపెంచుతున్నాడో ఎవరికీ చెప్పలేదు. వాళ్ళవాళ్ళ ఊహాగానాలకు వదలేశాడు. ఒకసారిమటుకు 'నేనొకటి సాధించటానికి ప్రయత్నం చేస్తున్నాను... అది సఫలీకృతం కాకపోతే మీసం తీయించేస్తాను. మీసం తీయించాలంటే పెంచాలిగదా...అందుకని పెంచుతున్నాను...' అని చెప్పాడు అప్పటినుంచి మరీ పుకార్లు ఎక్కువయినాయి. 'ఎవరినో ప్రేమించాడుట... ప్రేమ ఫలించలేదుట' అని, ప్రతిసంవత్సరం పరీక్షప్యాసయి పైక్లాసుకొస్తున్న పిల్లలు... నువ్వు పరీక్ష మళ్లా తప్పావుటగదా...' అని అడిగితే రోషంవచ్చిందనీ, ఈ ఆఫీసు పరీక్షఒకటి ప్రాణాలు తియ్యటానికి. చిన్నపిల్లల ముందరగూడా చిన్నబుచ్చుకోవలసి వస్తున్నది. గోపాలానికి పరీక్ష ప్యాసుకావాలన్న బెంగలేదు. ఇదొకలాటరీ. బ్రూసు-సాలీడు జ్ఞాపకం పెట్టుకుని పరీక్షవ్రాస్తూ ఉండటమే. మార్కులు వచ్చినవాడు ప్యాసవుతాడు. ఇంత వేదాంతసారము తెలిసి విచారపడటం బుద్ధిమంతుల లక్షణం కాదు. కాని స్నేహితులకు అర్థంకాలేదు. ఈ మీసాలకు ప్రేమకథ కారణం అయిఉంటుందనే నమ్మారు.

సృష్టి మొదలయి నప్పటినుంచి ఆడది అంటే మగాడు పడిఛస్తూనే ఉన్నాడు అందమయిన ఆడది అంటే మరీను. అంతటితో పోక ఈగోపాలం నిజంగా మేడమీదనుంచి పడిఛస్తున్నాడు అని కబురుఅందింది. నాకు భయంవేసింది. అంతఎత్తునుంచి పడిపోవటం అంటే అతనిసంగతి ఎలాఉన్నా కింద ఉన్నవాళ్లకు దెబ్బలు తగలవచ్చు. ఈ గొడవేమిటో చూద్దామని కిందకుదిగివచ్చాను. జనంఅంతా గుమిగూడిఉన్నారు. మేడమీద కిటికీవైపు చూస్తున్నారు.

'బాత్‌రూమ్‌లోకివెళ్ళి తలుపు వేసుకున్నాడు... అందులోంచి బయటకు దూకేస్తున్నాడు...'

'మీతో చెప్పాడా...'

'నాతో చెప్పాలా... అందరికి తెలిసింది...'

'ఎందుకని వడిచస్తున్నాడు...'

'పరీక్ష పోయిందని.'

'అయితే...'

'మనఆఫీసులో ప్రతిగాడిదా సూపరెంటు అయి పోతున్నాడు '

'ఇంకా సూపరెంటు కాని గాడిదలు చాలా ఉన్నాయిగా...'

అతను కొరకొరచూశాడు. నాకయితే గోపాలం కనిపించలేదు. కొంచెం ముందుకుసాగాను.

'నిన్న వాడు మీసం తీయించినపుడే అను కున్నాను...'

'ఏమని...'

'ఏదో కొంప మునిగిందని... పరీక్షపోయె... ప్రేమవిఫలమయ్యే...ఇంక ఏంచూసుకుబ్రతకాలి...'

'మీసం ఎందుకు తీసించాడో తెలుసా మీకు...'

'ఏదో ప్రతిజ్ఞ పట్టాడుట గదా...'

'మీకుతెలుసా...' అంతా తలొకరకంగా అను కోవటమేగాని నిజం ఎవరికి అర్థంకావడంలేదు. అంత మీసం తీయించివెయ్యటం మటుకు అందరికి తెలిసింది. జనంలోనుంచి తోసుకుంటు అటూ ఇటూ నడుస్తున్నాను. వక్కసారిగా గోపాలంకనిపించాడు. నమ్మలేకపోయాను. చెట్టుకిృందకూర్చుని అందరితో పాటు పైకి చూస్తున్నాడు. తెల్లబోయాను. మీసం తీసెయ్యటంతో వక్కసారిగా గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు. మెల్లిగా దగ్గరకుచేరాను.

'ఏమిటిరా గొడవంతా...'

'నాకు తెలియదురా... అందరితోపాటు వచ్చి చూస్తున్నాను...ఎవరోపైనుంచి దూకుతాడంటేను... అన్నాడు గోపాలం.

'ఎవరోఏమిటిరా! నువ్వే దూకుతావని చెప్పు కుంటున్నారు... పరీక్ష పోయిందనో... ప్రేమ బెడిసిందనో...'

'నేనా... ఛ! ఛ! పరీక్షపోతే దూకుతానుటరా? ప్రాణంపోయినా... దూకను...'

'మరి మీసం ఎందుకుతీయించావురా...'

'మాఆవిడ తీసెయ్యమందిరా... అందుకని... ఎవరితో చెప్పకు...' అన్నాడు గోపాలం నవ్వుతూ అతని పెదిమలు ఎర్రగా కనిపించాయి.